


## దీపావళి కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ

చెక్కలగేటు తెరచుకుని చేతిలో సూట్‌కేసుతో లోపలికి వస్తున్న 'సుమతి'ని, వెనుక ముగ్గురు పిల్లల్నీ చూసి గుండెల్లో రాయి పడ్డట్టు నిలబడి పోయింది గజలక్ష్మి. ఎంతో కాలానికి ప్రియమైన స్నేహితురాల్ని చూసిన ఆనందం కంటే, ఆమె చేతిలో ఉన్న సూట్‌కేస్‌లను చూస్తే కలిగిన భయమే ఆమె కళ్లలో ఎక్కువగా ఉంది – దానికి కారణమూ ఉంది.

ఉలుకూ పలుకూ లేని గజలక్ష్మిని చూసి సుమతి ఆగి, అడిగింది. "ఏమండీ ఇది కేశవ రావుగారి ఇల్లేనా? మీరు శ్రీమతి గజలక్ష్మి గారేనా?"

ఉలిక్కిపడి ఈలోకంలోకి వచ్చిన గజలక్ష్మి కంగారుగా 'ఔ'నన్నట్లు తలాడించింది.

"మరైతే అలా బొమ్మలా నిలబడి చూస్తావేమే... వచ్చి సూట్‌కేసందుకో!" అధికారం నటిస్తూ ఆర్డర్ వేసి చిన్నగా నవ్వింది సుమతి.

జామ చెట్టు దగ్గర ఆడుకుంటున్న కొందరు పిల్లలు వాళ్లని చూసి ముందుకు వచ్చారు. గజలక్ష్మి గబగబా వెళ్లి సుమతి చేతిలోని సూట్‌కేస్ అందుకుంది.

"ఇదేమిటే...? ఇంత హఠాత్తుగా...? అసలు నేనిక్కడున్నానని నీకెలా తెలిసింది...? ఎవరు చెప్పారు...?" అంటూ ఆశ్చర్యపోతూ ప్రశ్నలు కురిపించింది.

రెండు రోజుల క్రితం మా ఊరి బస్టాండ్‌లో మీ చెల్లెలు కాత్యాయిని కనిపించింది. తనూ, వాళ్లాయనా తిరుపతి వెళ్తున్నారట. మీరు ఈ ఊళ్లో ఉంటున్నారని అడ్రస్ చెప్పింది. మీ ఫోన్ నెంబర్ కూడా ఇచ్చింది. నిన్ను సర్‌ప్రైజ్ చేయడానికని ఫోన్ చేయకుండానే వచ్చేసాను" అంది సుమతి గజలక్ష్మి భుజాలమీద చేతులు వేసి ఇంటివైపు నడుస్తూ. ప్రక్క ప్రక్కనే రెండు చిన్న గదులు, వెనుక పొడవాటి వసారా ఉన్న చిన్న ఇల్లది. ఒక గది పడక గది అని తెలుస్తూనే ఉంది. రెండవగదిలో నాలుగైదు పాలక్యాన్లు, ఒక మంచం, ఇంకా ఏవేవో సామాన్లు ఉన్నాయి. వసారాలో ఒకవైపు వంట, మరొకవైపు భోజనాలు చెయ్యడం కోసం కొంత ఖాళీ స్థలం ఉంది.

సుమతి ఇంటి చుట్టూ ఒకసారి తిరిగి చూసింది. ఇల్లు చిన్నదే అయినా చుట్టూ చాలా

**జవ్వాది సుబ్రహ్మణ్య వరప్రసాద్**

# ఇరుకు



ఖాళీ స్థలం ఉంది. వెనుకవైపు ప్రహరీకి ఆను కుని వేసిన పాకలో రెండు గేదెలున్నాయ్. మరో ప్రక్క బాత్‌రూమ్, లావెట్రీ ఉన్నాయి. 'ఫర్వాలే దు' అనుకుంది సుమతి మనసులోనే.

సుమతి అలా తన ఇంటిని పరీక్షగా చూస్తు న్నంతసేపూ గజలక్ష్మి గుండెలు గుబగుబ లాడు తూనే ఉన్నాయి. కొంచెం ఇబ్బందిగానూ ఉంది.

సుమతి తన చిన్ననాటి ప్రాణ స్నేహితురా లు. తనకు చదువు మధ్యలోనే అనుకోకుండా మంచి సంబంధం వచ్చి, పెళ్లయిపోయింది. సుమతి ఇంకా పైచదువులు చదివి ఉద్యోగస్తురా లయింది. మరో ఉద్యోగికి భార్య అయింది. కోటీశ్వరులు కాకపోయినా ధనవంతులు క్రిందే లెక్క. అటువంటి సుమతి ఇటువంటి పిచ్చికగూ డు లాంటి ఇంట్లో ఎలా ఉండగలదు? ఒక పూటో... రోజో ఉండి చూసివెళ్లటానికి వచ్చిన ట్లు లేదు. సూట్‌కేస్‌తో వచ్చింది. అదే గజలక్ష్మి భయానికి కారణం! నాలుగు రోజులుంటే పెట్ట లేక కాదు... సంతోషంగా పెట్టగలదు. ఎటొచ్చీ ఆమె ఈ 'ఇరుకింట్లో' ఇబ్బంది పడిపోతుందే మోననే...! అసలు భయం.

లోపలికి వచ్చాక తన పిల్లల్ని గజలక్ష్మికి పరిచ యం చేసింది సుమతి.

"వీడు మా పెద్దబ్బాయ్ చైతన్య. టెన్త్. ఇది మా అమ్మాయి దీప్తి. ఎయిత్. వీడు మా మరిదిగారబ్బాయ్ విజయ్. వీడూ ఎయిత్తే. చిన్నప్పట్నుంచీ నాదగ్గరే చేరిక ఎక్కువ వీడికి. నేను మా పుట్టింటికి వెళ్లినా సరే వీడుండాల్సిందే" అని నవ్వుతూ పెట్టెలో నుంచి రెండు స్వీట్ ప్యాకెట్లు తీసి గజలక్ష్మి చేతికిచ్చింది.

అన్యమనస్కంగానే అందుకుంటూ తన పిల్లల్ని కూడా సుమతికి పరిచయం చేసింది గజలక్ష్మి.

"వీడు నాగేంద్ర. మా పెద్దవాడు. వీడి బారసాలకే నువ్వు ఆకివీడులో మా ఇంటికి వచ్చావ్. ఇంటర్ చదువుతున్నాడిప్పుడు. వీడు కృష్ణ, రెండోవాడు. నైన్త్ చదువుతున్నాడు. మూడవది ఆడపిల్లే అవుతుందని వీళ్ల నాన్నగారు సరదా పడ్డారు. సరదా తీరిపోయేలా ఇదిగో ఒకేసారి ఇద్దరు తయార్... సీత, గీత... సెవెన్త్" అంటూ... నీరసంగా నవ్వింది.

"ఈ ఆంటీ నా చిన్ననాటి స్నేహితురాలు రా... ఏలూర్లో టీచరమ్మ" అంటూ స్నేహితురాల్ని తన పిల్లలకి పరిచయం చేసింది. పిల్లలంతా ఒకేసారి "నమస్తే ఆంటీ" అన్నారు.

"ఇంతకీ మీవారేరే...? ఆయన్ని పరిచయం చెయ్యవా?" అడిగింది సుమతి. చటుక్కున ఏదో గుర్తొచ్చింది గజలక్ష్మికి. "భీమవరం వెళ్లారు ఓ గంటలోనో, అరగంటలోనో వచ్చేస్తారు..." అని చెబుతూనే పెద్దకొడుక్కి సైగచేసి లేవబోయింది.

సుమతికి అర్థమై ఆమెని చెయ్యిపట్టి ఆపింది. "తినడానికి నేనేవో తెచ్చాగదా...? నువ్వు కాస్త 'టీ' పెట్టు చాలు. ఇప్పుడు వాణ్ణి ఎక్కడికీ పంపకు" అంది.

పిల్లలంతా వీధి అరుగు మీదకి చేరి ఆటల్లోనూ, కబుర్లలోనూ మునిగిపోయారు. సుమతి తెచ్చిన స్వీట్లు పిల్లలందరికీ ఇచ్చి, రెండు గ్లాసుల 'టీ'తో వచ్చి సుమతి ప్రక్కన కూర్చుంది గజలక్ష్మి.

"ప్రతి దసరా శలవులకూ మేం తప్పకుండా ఏదో ఒక పల్లెటూరుకి వెళతామే... రెండు మూడు రోజులుండి, మా అమ్మగారింటికో లేదా ఏ చూడదగిన ఊరికో వెళతాం. లక్కీగా ఈసారి నీ ఊరికి వచ్చాను. ఊరు బాగానే ఉందిలే. నువ్వున్నావు కనుక ఈసారి శలవులన్నీ ఇక్కడే గడిపేయాలనుంది" అంది సుమతి... గజలక్ష్మి కళ్లలోని కలవరపాటుని ఓరకంట గమనిస్తూ. స్నేహితురాలి మనసుని ఆమె ఎప్పుడో చదివేసింది.

"పాపం అక్కడ ఆయనకి ఇబ్బందేమో?" అంది గజలక్ష్మి ఇబ్బందిగా కళ్లుమిటకరిస్తూ...

"ఏం లేదు. ఆయనకి వంట నేర్పేశాన్లే. అత్తగారూ, పనిపిల్లా కూడా ఉన్నారు".



## రచయిత పరిచయం

వృత్తిరీత్యా హిందీ ఉపాధ్యాయుడైన శ్రీ జవ్వాది సుబ్రహ్మణ్య వరప్రసాద్ అనేక కథలు, కవితలు వ్రాసారు. వివిధ పత్రికలలో అనేక బహుమతులు కూడా పొందారు. వ్రాయడమే కాదు - గీయడంలో కూడా దిట్ట అయిన ఈయన కార్టూన్లు, డ్రాయింగ్‌లనే కాక సబ్బులు, సుద్దలపై శిల్పాలు చెక్కడం కూడా హాబీగా ఎంచుకున్నారు. 'వృక్షవిలాపం' అనే ఖండకావ్యాన్ని కూడా వీరు రచించారు.

అప్పుడే బయటినుంచి వచ్చిన కేశవరావు ఇంట్లోకి రాబోతూ కొత్త గొంతుకలు విని అక్కడే ఆగిపోయాడు. "అమ్మ ఫ్రెండట నాన్నా! ఏలూర్నుంచొచ్చారు" అన్నాడు కృష్ణ తండ్రితో.

"అలాగా...! అంటూ లోపలికి వచ్చి, "ఓ... మీరా! సుమతి గారు కదూ... మీ పెళ్లికి వచ్చాం నేను, గజలక్ష్మి... అన్నాడు గజలక్ష్మి ఆల్బంలోని సుమతి ఫొటో గుర్తు తెచ్చుకుంటూ.

సుమతి లేచి నమస్కారం చేసి "బావున్నారా?..." అని పలకరించింది. భార్య ఇచ్చిన అల్పాహారం తిని, టీ త్రాగి మరో రెండు మూడు కుశల ప్రశ్నలు వేశాడతను. కొంతసేపటి తర్వాత సుమతి అందర్నీ ఉద్దేశించి నవ్వుతూ చెప్పింది మృదువుగా. "చిన్ననాటి స్నేహితురాళ్లం... చాలా కాలానికి కలుసుకున్నాం. కష్టం, సుఖం, పిచ్చాపాటీ మాట్లాడుకోవాలి కదా...? ఇక కొంతసేపు మీరంతా బయటికి వెళ్లిపోండి. నాలుగున్నరా, ఐదు వరకూ ఈ దరిదాపులకు రాకండి. నాగేంద్రా... నువ్వు మా పిల్లల్ని జాగ్రత్తగా తీసుకువెళ్లి మీ ఊరంతా చూపించు".

ఆ ఆర్డర్ తనకి కూడా...! అని అర్థమై ముందు తెల్లబోయి, తర్వాత ఖంగారుగా వెళ్లిపోయాడు కేశవరావు.

'కెమెరా' తీసుకుని పిల్లలంతా 'నాగేంద్ర' వెనుకే వెళ్లిపోయారు ఆనందంగా.

"హవ్వ... అంటూ నోరు నొక్కుకుని "నీ స్పీడేం మారలేదే...?" అంది గజలక్ష్మి. సుమతి లేచి వెళ్లి గజలక్ష్మి ప్రక్కన కూర్చుంది. కొద్దికొద్దిగా టెన్షన్ తగ్గుతోంది గజలక్ష్మికి.

"ఇప్పుడు చెప్పవే... ఎలా ఉంది నీ సంసారం? మీ అత్తవారిది 'ఆకివీడు' కదా, ఈ ఊరెప్పుడు వచ్చేసారు?... అక్కడికి రెండు మూడు లెటర్లు వ్రాసినా జవాబు రాలేదు".

"సంసారానికేం...? దేవుడి దయవల్ల బాగానే ఉంది. 'ఆకివీడు'లో ఉండగా ఈయన ఏవేవో వ్యాపారాలు చేసి సగం చేతులు కాల్చుకున్నారు. చాలా దెబ్బతినేశాంలే... చివరికి ఇక్కడ ఎవరో తెలిసినవాళ్లు ఇంటితో సహా స్థలం బేరం పెడితే కొనుక్కుని, ఇక్కడికి వచ్చేసాం. అక్కడుండలేక..."

"ఇంత పెద్ద స్థలంలో మరీ ఇంత చిన్న ఇల్లేమిటే... చుట్టాలు రారనా...?! నేను చాలా మొండిదాన్ని. ఎంత ఇరుకులోనైనా ఇరుక్కుపోతాను..." అంటూ నవ్వింది సుమతి.

"చుట్టాలెందుకురారు...!? ప్రతి వేసవి శలవులకూ పెద్ద ఆడబడుచూ, ప్రతి దసరా శలవులకూ చిన్నావిడా వచ్చేస్తారు నాకు చెమటలు పట్టించడానికి. ఈసారింకా రాలేదెందుకోమరి...?" అంది గజలక్ష్మి తనూ నవ్వి.

అలా నాలుగున్నర వరకూ ప్రవాహంలా సాగాయి కబుర్లు. "అనుకోని కష్టాలేవయినా ఎదురైతే ఏమోగానీ ప్రస్తుతం మా జీవితం హాయిగానే ఉంది. ఇంతకుమించి దేవుణ్ణి నేనేమీ కోరను. నీటముంచినా, పాల ముంచినా నీదే భారం స్వామీ అంటానంతే... అంతే కదే మరి... అనుకోలేదని ఆగేవి, అనుకున్నామని జరిగేవీ లేనపుడు అలాగే కదా అనుకోవాలి...?" అమాయకంగా చూస్తూ సుమతి భుజంమీద తలవాల్చింది గజలక్ష్మి.

"అవును... "జిస్‌కో కభూన చాహియే సోయీ శాహం శాహ్" అన్నాడు కబీర్ అంటూ స్నేహితురాల్ని ముద్దుపెట్టుకుంది సుమతి.

సరిగ్గా అప్పుడే నిశ్శబ్దంగా ఇంట్లోకి వచ్చిన పిల్లలు పకపకా నవ్వుతూ చప్పట్లు చరిచారు. వాళ్లని చూసాక గుర్తొచ్చింది గజలక్ష్మికి... "అయ్యో! సాయంత్రానికి వంట చెయ్యాలి కదూ"

అంటూ లేచింది. ఆమె చెయ్యి పట్టి ఆపింది సుమతి.

"వంట చెయ్యడం తప్పదు కనుక చెయ్యి. కానీ ఎక్కువ ఆయాసపడిపోకు."

"ఆయాసం ఏముంది? మాకోసం ఉదయం వండిన కూర ఉంది. అన్నం ఎలానూ వార్చాలి. దానితో బాటూ... ఒక కూర, సాంబారూ...! సుమతి అడ్డుతగిలింది.

"ఒక వేపుడూ, పచ్చడీ, అప్పడాలు, వడియాలు వేయించి, ఆవకాయ ఎలానూ ఉంటుంది. పెరుగులోకి అరటిపళ్లు తెప్పించి... సేమ్యా కూడా కాచావంటే...!"

"సరే...! అంటూ వెనక్కి తిరిగింది గజలక్ష్మి అయోమయంగా బుర్రగోక్కుంటూ".

"పిచ్చిదానా ఇలా అతి మర్యాదలు చేస్తే నీ మాడు పగలగొట్టి, మార్నింగే వెళ్లిపోతాను. నేను నీ చుట్టాన్ని కాదు. నీ అక్కనో చెల్లినో అనుకో - నువ్వేం తింటే అదే పెట్టు. ఏం తాగితే అదే మాకు ఇవ్వు. మమ్మల్నేమాత్రం వేరుచేసి చూసినా జాగ్రత్త... నువ్వు వంట పని చూస్తుండు. నేను పిల్లల స్నానాల పని చూసి స్నానం చేసి వస్తాను. అంటూ టవల్స్ తీసుకుని పిల్లల్ని పిలిచింది.

"సరే తల్లీ... అలాగే కానీ కాస్సేపాగు... వేణ్ణీళ్లు పెట్టిస్తాను" అంది గజలక్ష్మి.

"వేణ్ణీళ్లా...? మీరంతా వేణ్ణీళ్లు చేస్తారా...?

"లేదులే... చన్నీళ్లే చేస్తాం. ఆయనకి మాత్రం పెడతాను చన్నీళ్లు పడవని..."

సుమతి తల తిప్పి తన పిల్లలవైపు చూసింది ఒక్కక్షణం. దీప్తి చిన్నగా నవ్వి అభయమిస్తున్నట్టు నెమ్మదిగా కళ్లుమూసి తెరిసింది. తృప్తిగా తలాడించింది సుమతి.

"మా పిల్లలక్కూడా చన్నీళ్లే అలవాటు" అంటూ పిల్లల్ని తీసుకుని పెరటివైపు నడిచింది. మందు వేసవిలో కూడా శలవులకి వచ్చినపుడు తనకి, తన పిల్లలకీ వేణ్ణీళ్లు పెట్టించుకునే ఆడపడుచు గుర్తొచ్చింది గజలక్ష్మికి.

* * *

భోజనాలయ్యాక కాసేపు పిల్లలకు కబుర్లు చెప్పి, ఇంట్లో చోటుచాలదని నిద్రపోవడానికి ఎవరో తెలిసిన వాళ్లింటికి వెళ్లిపోయాడు కేశవరావు. చిన్న కొడుకుని కూడా రమ్మన్నాడు కానీ, కొత్త స్నేహితుల్ని వదిలి వెళ్లడానికి వాడు ఒప్పుకోలేదు.

పిల్లలందర్నీ రెండు గదుల్లోనూ సర్ది, వంట గదిలో చాపలు పరుచుకున్నారు సుమతీ, గజలక్ష్మి.

"పుట్టుకతో డబ్బున్న దానివి, ఉద్యోగస్తురాలివీను. రాకరాక ఇలాంటి ఇరుకింటికి వచ్చి అనవసరంగా కష్టాలు పడుతున్నావేమోనే...?" బాధగా అంది గజలక్ష్మి.

సుమతి ఆమె నెత్తిమీద చిన్నగా మొట్టింది. చెబితే నమ్మవుగానీ... నాకిక్కడ చాలా హాయిగా ఉంది. 'ఆకులో ఆకునై, పూవులో పూవునై' పాటలో లాగా ఇక్కడే ఉండిపోవాలని కూడా ఉంది. కష్టం సుఖం పంచుకునే మనసు ముఖ్యంగానీ చాపలూ మంచాలూ ముఖ్యమా...? అంటూ గజలక్ష్మి చెవిలో ఏదో గుసగుస లాడింది.

తను కూడా సుమతి నెత్తిమీద మొట్టి, వెంటనే గట్టిగా కౌగిలించేసుకుంది గజలక్ష్మి. "మంచం లేకపోతే నాకు, పిల్లలకూ నిద్దర్రాదొదినా" అనే చిన్నాడపడుచు గుర్తొచ్చిందామెకి.

"ఆకులో ఆకువై కాదు నా మనసులో మనసై ఉండిపోవే...!" అంది ప్రేమగా. బెడ్‌లైట్

వెలుగులో ఆమె కళ్లు తడిగా మెరిసాయి.

*    *    *

ఆ ఉదయం ఆకాశం మబ్బుగా ఉంది. చలిగానూ ఉంది. "పెరట్లో బోలెడు పుల్లలూ, పిడకలూ ఉన్నాయి. చలిగా ఉంది కదా వేణ్ణీళ్లు పెడతాను" అంది గజలక్ష్మి.

వెంటనే అందుకున్నాడు విజయ్... "వద్దు ఆంటీ...! చలిగా ఉన్నప్పుడు చన్నీళ్లు స్నానం భలేగా ఉంటుంది. చలివెయ్యకుండా ఉండాలంటే ముందు మొహం కడుక్కోవాలి. తర్వాత రైట్ హ్యాండ్‌తో నీళ్లు తీసుకుని లెఫ్ట్ హ్యాండ్‌ని వేగంగా రుద్దాలి. తర్వాత లెఫ్ట్ హ్యాండ్‌తో రైట్ హ్యాండ్‌ని, తర్వాత స్టమక్, చెస్ట్ అలా ఒక్కో పార్ట్‌నీ తడిపి, అప్పుడు 'సోప్'తో రుద్దుకుని గబగబా వాటర్ పోసేసుకోవాలి. అంతే... చలి ఫినిష్...!"

"పిల్లలకు బాగానే ట్రైనింగ్ ఇచ్చావే..." అంది గజలక్ష్మి నవ్వుతూ. సుమతి విజయ్‌వైపు తిరిగి కళ్లతోనే మెచ్చుకుంది.

కేశవరావు బాగా ఉదయమే పాలక్యాన్లు తీసుకుని వెళ్లిపోయాడు. ఆ ఊళ్లోను, చుట్టుప్రక్కలా పాడి ఉన్న ఇళ్లలో నుంచి పాలుసేకరించి దగ్గర్లో ఉన్న పాలకేంద్రానికి చేర్చడం అతని ఉద్యోగం.

అందరి స్నానాలూ అయ్యాక పెద్దకొడుకు చేతికి సంచి, డబ్బులూ ఇస్తూ ఏదో చెబుతోంది గజలక్ష్మి. సరిగ్గా అప్పుడే స్నానం ముగించుకుని వచ్చింది సుమతి.

"ఎక్కడికి పంపుతున్నావే...?" అడిగింది ఏదో అర్థమై.

"ఉప్మా చేస్తున్నాను. పెద్దరోడ్డు మీద హోటల్లో పెసరట్లు బావుంటాయని తెమ్మంటున్నాను... నీకు ఉప్మా పెసరట్టు ఇష్టం కదా...?" అంటూ నవ్వింది గజలక్ష్మి.

"గొప్ప ఘనకార్యం చేస్తున్నావులే. ఇంత పెద్ద సైన్యానికి హోటల్ టిఫిన్ ఎంతవుతుందో తెలుసా...?" అంటూ సుమతి కళ్లెర్రజేసింది.

"అందరికీ కాదులే... మా పిల్లలకి రాత్రి అన్నంలో పాలుపోసి తోడుపెట్టి ఉంచుతాను. అది తింటారు. ఆరోగ్యానికి మంచిదట కదా?"

"అంటే మీ పిల్లలకి ఆరోగ్యం కావాలి, నా పిల్లలు హోటల్ టిఫిన్ తిని ఆరోగ్యం పోగొట్టుకోవాలన్న మాట...!?" అంటూ గజలక్ష్మి ముక్కుపట్టుకుని ఆడించింది సుమతి. "నా పిల్లలక్కూడా అదే పెట్టు... ఆరోగ్యంగా ఉంటారు...!" అంది.

గజలక్ష్మి ముక్కు విడిపించుకుని 'ఉక్రోషం'గా చూసింది ఆమె వైపు. "నా ఇంటి కొచ్చి నామీద పెత్తనం చేస్తున్నావేమిటే... అంతా నీయిష్టమేనా...!?"

"నీ ఇల్లుకాదే... నేనున్నంత వరకూ ఇది నా యిల్లు...!" అంటూ ఆమెని వంటగదిలోకి లాక్కుపోయింది సుమతి "పద ఉప్మా తిందాం" అంటూ.

ఎనిమిది గంటలవుతూండగా తిరిగి వచ్చాడు కేశవరావు. వస్తూ పిల్లలందరికీ స్వీట్లు తెచ్చాడు. స్నానంచేసి ఉప్మా తిన్నాక వాకిట్లో జామ చెట్టు క్రింద పిల్లల్ని పోగుచేసి కబుర్లు చెప్పాడు, చెప్పించుకున్నాడు.

"ఆయన సహజంగా చాలా తక్కువ మాట్లాడతారు. ఇవాళేమిటో మరి?!" అంది గజలక్ష్మి. మధ్యాహ్నం భోజనాల తర్వాత కాసేపు కబుర్లు చెప్పుకున్నాక, గజలక్ష్మి వెళ్లి పశువుల కొట్టం బాగుచేసి, పిడకలు చెయ్యడానికి కూర్చుంటే "నాకూ నేర్పు... నేనూ చేస్తాను" అంటూ సిద్ధమైపోయింది సుమతి. గజలక్ష్మి నిర్ఘాంతపోయిం

ది.

"ఏమిటే నువ్వు...? నాకేం అర్థంకావడం లేదు. ఇక్కడి కొచ్చిన దగ్గర్నుంచీ చేసేవి చాలక ఆఖరికి ఈ పేడ పట్టుకుని పిడకలు కూడా చేస్తానంటావ్... మీ ఆయనకి తెలిస్తే వీపు పగ లుగొట్టరూ..."

"మావారు ఏమీ అనరు... 'బి ఏ రోమన్ ఇన్ రోమ్' అంటారు. చిన్నప్పుడు పేడతోనే కదే... గొబ్బెమ్మలు పెట్టాం. పిడకలు ఇలా అం దంగా గుండ్రంగా చెయ్యడం కూడా ఒక విద్యే కదా... వృత్తి విద్య" అంటూ పైటచెంగు నడుం చుట్టూ బిగించింది.

సుమతితో తను గెలవలేనని తెలిసి, వారిం చడం, వాదించడం మానేసింది గజలక్ష్మి. ఆ ఓటమి ఎంతో మధురంగా, హాయిగా ఉంది.

"మేమొచ్చింది రొటీన్ లైఫ్ నుంచి కాస్త రిలాక్స్ అవడానికే కానీ, ఇక్కడ కూడా శ్రమ పడిపోవడానిక్కి కాదు" అన్నట్టు ప్రవర్తించే 'బం ధువులు' గుర్తొచ్చారు గజలక్ష్మికి.

సుమతి పేడముద్దను బలంగా గోడకు కొ ట్టింది, ఎప్పటినుంచి రెడీగా ఉన్నాడో చైతన్య చేతిలో కెమెరా క్లిక్‌మంది. చెట్లచాటునా, గోడ చాటునా ఉన్న పిల్లలు ఘొల్లుమని నవ్వారు.

* * *

తెలియకుండానే మూడు రోజులు గడిచిపో యాయ్. ఆ మూడు రోజులూ సుమతీ, ఆమె పిల్లలూ ఆ పాలవ్యాపారి కుటుంబంతో పాలూ నీళ్లలా కలిసిపోయారు. గజలక్ష్మి వంటచేస్తుంటే సుమతి కూరలు తరిగి ఇచ్చింది. ఆమె పాత్రలు తోమితే ఈమె కడిగి ఆరబెట్టింది. ఖాళీగా ఉన్నప్పుడు పిల్లలందర్నీ చుట్టూ చేర్చుకుని ఎన్నో వింతలూ విశేషాలూ చెప్పింది. తమాషా లెఖ్ఖలు చెప్పింది. రకరకాల జోకులు చెప్పి కడు పుబ్బ నవ్వించింది. ఆటలు ఆడించి, పాటలు పాడించింది. ఆ మూడు రోజుల తన సాహచ ర్యంతో ముప్ఫై సంవత్సరాల సాన్నిహిత్యాన్ని చ్చింది. అందుకే మూడు రోజులు మూడు క్షణాల్లా గడిచిపోయాయి.

"ఇవాళ భోజనాల్లోకి పులిహోర చెయ్యవే గజం... నువ్వే స్వయంగా చెయ్యాలి సుమా. కొంచెం కూడా సాయం చెయ్యను" అంది సుమ తి ఉదయం స్నానంచేసి 'జడ' వేసుకుంటూ. గజలక్ష్మి ఆశ్చర్యంగా చూసింది. "ఏం వండుతా నన్నా వద్దనేదానివి... వద్దన్న పనులన్నీ చేసేదా నివి. ఇవాళేమయింది...?!"

"ఇవాళ భోజనం చేసి బస్ ఎక్కేద్దామను కుంటున్నాను... అందుకని".

గజలక్ష్మి నిర్ఘాంతపోయింది. "ఏమిటీ ఇవా ళే...?" అరిచినంత పనిచేసింది.

"మావారు కల్లోకొచ్చేస్తున్నారే బాబూ. అదీ గాక ఆయనగారి ఫ్రెండొకరు హైదరాబాద్ నుంచి ఫ్యామిలీతో సహా వస్తున్నారట. ఫోనొ చ్చింది. నిజం... నీమీదొట్టు!" అంది సుమతి.

గజలక్ష్మి దిగులుతో మొహం వేలాడేసింది. ఆమె నోట్లోంచి మాటరాలేదు.

"అలా మొహం వేలాడేసుకుని పులిహోర చెయ్యకు. టేస్ట్ చెడిపోతుంది. మళ్లీసారి వచ్చి నప్పుడు ఓ వారం పదిరోజులుంటాన్లే...!" అం ది సుమతి బుజ్జగింపుగా.

అయినా సుమతి ఎంత మాట్లాడించినా పొడిపొడిగానే మాట్లాడింది.

భోజనాలయ్యాక బట్టలు సర్దుతూ పిల్లల్ని సిద్ధం చేస్తుంటే విజయ్ అడిగాడు.

"పెద్దమ్మా! నువ్వు వచ్చేటప్పుడు చెప్పినట్టే బుద్ధిగానే ఉన్నాం కదూ మేము...?" సుమతి

అభినందనగా చూసి వాడి నుదుటిమీద ముద్దు పెట్టుకుంది. అప్పుడే వచ్చి మౌనంగా తలుపుకు ఆనుకుని నిలబడ్డ గజలక్ష్మిని చూసి చిన్నగా నవ్వుతూ పెట్టెలోంచి ఒక ప్యాకెట్‌తీసి గజలక్ష్మి చేతిలో పెట్టింది సుమతి.

"ఇది నేను వచ్చేటప్పుడే తెచ్చాను. వెళ్లేటప్పుడు ఇద్దామని ఉంచాను" అంది. దానిమీద "ప్రియమైన గజానికి ఆరు గజాల ప్రేమతో...!" అని ఉంది. దానిలో ఉన్నదేమిటో ఊహించి, గజలక్ష్మి ఉక్రోషంతో దాన్ని సుమతి వళ్లోకి విసిరేసింది.

"నాకేం అఖ్ఖర్లేదు. ఇంటి నుంచి వెళ్లిపోతున్న చుట్టానివి... నీకు నేను పెట్టాలా? నాకు నువ్వా...? తీరా ఆయనేమో ఊళ్లోలేరా? మధ్యాహ్నం వరకూ రారా...? నీ దారిన నువ్వు ప్రయాణమై పోతావన్నమాట?! రేపో, ఎల్లుండో నిన్ను తీసుకెళ్లి చీర కొనొచ్చు అనుకున్నాను. పెద్ద ఉద్యోగస్తురాలివి కాబట్టి నువ్వే ఎదురు పెడుతున్నావన్నమాట...!?" అంది ముత్యాలు రాలకుండా రెప్పలు టపటపలాడిస్తూ.

సుమతి లేచి గజలక్ష్మిని దగ్గరకు తీసుకుంది. "పిచ్చిదానా, నేను కొంటే ఏమిటి... నువ్వు కొంటే ఏమిటి చెప్పు...? ఈసారి నువ్వు మా యింటికి వచ్చేటప్పుడు ఇంతకంటే మంచిది తీసుకురా. నాకు చీర ఇవ్వడానికైనా వస్తావు లే... నాకు తెలుసు. అయినా నాకు తెలియక అడుగుతాను... మొదటిరోజున మమ్మల్ని చూడగానే నీ గుండెల్లో రాయి పడింది కదా...? నేను గమనించాన్లే... ఇప్పుడేమిటీ మేం వెళ్లిపోతుంటే ఇలా కన్నీళ్లయిపోతున్నావ్...? అంది కవ్వింపుగా.

గజలక్ష్మి గభాలున తన మొహాన్ని సుమతి గుండెల్లో దాచేసుకుంది.

"అవును... రాయిపడి, గుండెల్లో అడుగునెక్కడో ఉన్న నీళ్లు తుళ్లి ఇలా కళ్లలోంచి కారుతున్నాయ్...!" అంది గట్టిగా మొహం రుద్దేసుకుంటూ. ఒక నిమిషం నిశ్చలంగా ఉండి, మళ్లీ చెప్పింది సుమతిని వదలకుండానే... "నిజమేనే... ఈ ఇరుకింట్లో ఎలాగా అని ముందు భయపడ్డాను. కానీ ఏం మాయచేసావే? నా ఇల్లు పుష్పక విమానమైపోయింది...!?"

మధ్యాహ్నం రెండింటికి కేశవరావు వచ్చేవరకూ వాళ్లు అలాగే ఉన్నారు. బయట పిల్లలు వీడ్కోలు సమావేశంలో ఉన్నారు. వాళ్లు వెళ్లిపోతున్న విషయం తెలిసి కేశవరావు ఆశ్చర్యపోయాడు. "అప్పుడేనా...? మరో రెండురోజులుండవచ్చు కదండీ...!" అన్నాడు.

సుమతి ఫోన్ వచ్చిన సంగతి చెప్పి మరొకసారి తప్పకవస్తానని మాటిచ్చింది. కేశవరావు రిక్షా పిలుచుకు వస్తానన్నాడు కానీ అక్కడికి మెయిన్‌రోడ్డు దగ్గరే కనుక నడిచే వెళ్లొచ్చంది సుమతి.

వాళ్లని బస్ ఎక్కించడానికి గజలక్ష్మితో సహా అందరూ ఊరేగింపుగా బయలుదేరారు.

* * *

బస్‌వెళ్లిపోయాక దిగాలుగా తిరిగి వచ్చిన గజలక్ష్మిని పక్కింటి పద్మావతి గోడవతల నుంచి పలకరించింది.

"హమ్మయ్య... చుట్టాలు వెళ్లిపోయారన్నమాట. వాళ్లతో ఆ ఇరుకింట్లో ఎంత ఇబ్బంది పడ్డావో ఏమిటో పాపం. ఇప్పుడు ప్రాణాలు కాస్త తెరిపిన పడ్డట్టున్నాయి కదూ...!" అంది కుతూహలంతో సానుభూతి చూపిస్తూ.

"లేదు పద్దక్కా. ఇప్పుడే గుండెలు బరువెక్కినట్టున్నాయ్. ఇల్లు లోపలికి అడుగు పెట్టలేనంత ఇరుగ్గా కనిపిస్తోంది!" అంటూ అక్కడే అరుగు మీద కూర్చుండిపోయింది గజలక్ష్మి. ●